క్లుప్తంగా

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

హసన్‌పర్తి: అబ్దుల్‌కలాం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందిన భీమారానికి చెందిన కన్నె నవీన్‌ను 55వ డివిజన్ సత్యసాయి కాలనీలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి కాలనీ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి (టీఆర్‌కేరెడ్డి), సభ్యులు నారాయణ రెడ్డి, సత్యం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, వెంగల్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న శ్రీకాంత్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సినీహీరో శ్రీకాంత్ శనివారం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించి అర్చకులు మహాదాశీర్వచనం అందజేశారు.

యూనిఫాంల అందజేత



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం యూనిఫాంలు అందజేశారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తన సొంత ఖర్చుతో యూనిఫాంలు సమకూర్చారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఏడో తరగతి వరకు తాను ఇదే పాఠశాలలో చదివినట్లు గుర్తుచేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.2లక్షలు ఇస్తానని ఆయన ప్రకటించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అప్పటి గురువు పి.సాంబమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాసంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సుమారు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఆ పనులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పూల, శ్రీనివాస్‌రెడ్డి, మదన్ గౌడ్, శ్రీరాములు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజు, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఖిలా వరంగల్: రైలు పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. గీసుకొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన తమ్మడబోయిన రాజేందర్ (37) శుక్రవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో చింతలపల్లి రైల్వేస్టేషన్ మధ్య శాయంపేట గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో రాజేందర్‌ను రైలు ఢీకొట్టింది. మృతదేహానికి శవపరీక్ష చేసి కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించినట్లు కానిస్టేబుల్ వివరించారు.

మద్యం విక్రేతపై కేసు

మడికొండ: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి మహేందర్ మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా, పోలీసులు దాడి చేసి రూ.5,340 విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

'కలాం' డిఫెన్స్ ఎక్స్‌పో



మడికొండ: మడికొండలోని రైజింగ్ ఇండియన్ టెక్నో స్కూల్‌లో కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శనివారం స్పేస్, డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్షం, ఉపగ్రహాలు, చంద్రయాన్ గురించి విద్యార్థులకు ఇస్రో, డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ ప్రతినిధులు వివరించారు. వాటి తయారీ, పనితీరు ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జాతరలను వాడుకోవద్దు

హన్మకొండ: రాజకీయ కక్ష సాధింపు కోసం జాతరలను వాడుకోవడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని పేర్కొన్నారు. గతంలో మేడారం జాతరను అట్టర్ ఫ్లాప్ చేయగా ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. హైదరాబాద్ బోనాల ఉత్సవాలపై సైతం ఏకంగా మంత్రులు, మేయరు బహిరంగంగా నిరసన తెలిపారని తెలిపారు. కొమ్మాల జాతరను కాంగ్రెస్ నాయకులు వాడుకోవడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.

బాధిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్

- కరెంట్ పోతే సిగ్నల్స్ కట్
- టవర్‌కు బ్యాటరీ బ్యాకప్ లేకపోవడమే కారణం
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నడికూడ : మండల కేంద్రంలో 14 సంవత్సరాల క్రితం భారత ప్రభుత్వ టెలికాం కంపెనీ, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్‌ఎన్‌ఎల్) టవర్‌ను ఏర్పాటు చేశారు. అయితే మొదట్లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే బ్యాటరీ బ్యాకప్‌తో సిగ్నల్స్ వ్యవస్థను కొనసాగించేవారు. కానీ కొన్ని సంవత్సరాల నుంచి అధికారులు టవర్ మోయింటనేన్స్‌ను పట్టించుకోకపోవడంతో బ్యాటరీస్ డ్రై అవడంతో అవి పనిచేయడం లేదు. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే మొబైల్ సిగ్నల్స్ నిలిచిపోతున్నాయి. దీంతో వినియోగదారులకు సిగ్నల్ సమస్య వేధిస్తోంది. మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల అధికారులతో పాటు మండలంలోని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు సిగ్నల్స్ సమస్య తలెత్తడంతో వారు డ్యూయల్ సిమ్, ఇతర నెట్‌వర్క్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే బీఎస్‌ఎన్‌ఎల్ చాలా ప్రాంతాలకు 4జీ నెట్‌వర్క్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, కానీ మండలంలో కనీసం ఫోన్లు చేసుకునేందుకు కూడా సిగ్నల్స్ రావడం లేదని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. కాగా ఈ టవర్ ద్వారా ఇతర ప్రైవేట్ టెలికాం సంస్థల సర్వీస్ సక్రమంగా అందిస్తుండడంతో మండలంలోని పలువురు ఇతర నెట్‌వర్క్‌లోకి మారుతున్నారు. కేవలం బీఎస్‌ఎన్‌ఎల్ అధికారుల నిర్లక్ష్యం వలన తరుచుగా సిగ్నల్స్ సమస్య తలెత్తుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని మండలంలోని బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్

సిగ్నల్స్ ఉండడం లేదు



గత కొన్ని రోజుల నుంచి పూర్తిస్థాయిలో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ ఉండటం లేదు. కనీసం ఫోన్లు చేసుకునేందుకు కూడా సిగ్నల్స్ రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు సిగ్నల్ సమస్యను గుర్తించి పూర్తిస్థాయిలో సేవలను అందుబాటులోకి తీసుకురావాలి.

- దోమ పవన్, ముస్త్యాలపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



మండల కేంద్రంలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ ఏర్పాటు చేయడంతో స్థానికులు బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కొనుగోలు చేశారు. కానీ కొన్ని రోజుల నుంచి సిగ్నల్స్ సరిగా ఉండటం లేదు. టవర్‌కు బ్యాటరీ బ్యాకప్ లేకపోవడంతో సమస్య నెలకొందని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

- దురిశెట్టి రేవంత్, నడికూడ

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీఓ రాజ్‌కుమార్

ఆత్మకూరు : విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలని ఎంజేపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆర్‌సీఓ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాలలో భోజనాన్ని, వంటల తయారీని పరిశీలించారు. తరగతి గదులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల నుంచి సోడాషపల్లి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పక్కన ఆయా గ్రామాల ప్రజలు చెత్తాచెదారం, వ్యర్థాలు పడేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం సాక్షి దినపత్రిక 'రోడ్డుపైనే చెత్తాచెదారం' అనే కథకం ప్రచురించింది. మల్లికుదుర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ సిబ్బందితో చెత్తాచెదారం తొలగింపజేసి రహదారి పరిసరాలను శుభ్రపరిచారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



కేడీసీలో మాట్లాడుతున్న అనితారెడ్డి



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న పరశురాములు

విద్యారణ్యపురి: వినియోగదారులకు జరిగే మోసాల వాటి నుంచి రక్షణ పొందేందుకు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విభాగం కన్జ్యూమర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వస్తువుల నాణ్యత, సరుకుల కల్తీపై ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, కన్జ్యూమర్ క్లబ్ కన్వీనర్, సేవా సంస్థ ప్రతినిధులు విశాల, డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వినోద్‌రావు, డాక్టర్ చిన్న, డాక్టర్ యాకూబ్, స్వర్ణలత పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే వెంటనే కమిషన్‌ను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి, విజయ, శ్రీలత, భాగ్యలక్ష్మి, సుమిత్ర, అరుణ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత ?

ధర్మసాగర్ : మండలంలోని యువత గంజాయి మత్తులో మునిగితెలుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గంజాయి సేవించిన పలువురు యువకులు అనవసర గొడవలకు దిగుతున్నట్లు తెలిసింది. కొంత మంది యువకులు గంజాయి, మద్యం సేవించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే ఇది ఇలాగే కొనసాగితే గంజాయి మత్తులో యువకులు జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందని, గంజాయి రవాణాను అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు సైతం ప్రత్యేక దృష్టి వహించి గంజాయి రవాణా నివారించాలని కోరారు.

నేడు శంకుస్థాపన

శాయంపేట : మండలంలోని తహరాపూర్, కొత్తగట్టు సింగారం, పెద్దకోడెపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, నేరేడుపల్లి, గంగిరేణిగూడెం, కాట్రపల్లి, వసంతాపూర్, కొప్పుల, జోగంపల్లి, మైలారం గ్రామాల్లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు మసీదుల ఎదుట శాంతియుత నిరసనలు



ప్లకార్డులు ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

న్యూశాయంపేట: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సోమవారం జోహర్ నమాజ్ అనంతరం అన్ని మసీదుల ఎదుట ప్లకార్డులు పట్టుకుని శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు గ్రేటర్ వరంగల్ ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్ సుభాన్, అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి మెయిల్ పంపినా కేంద్రం ఖాతరు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు అజీజుల్లా బేగ్, బాబా ఖాదర్ వలీ, హబీబ్‌ఖాన్, ఎంఏ.బాబా, మహ్మద్ చాంద్‌పాషా, మహ్మద్ షకీల్ అహ్మద్, మహ్మద్ మొహినొద్దీన్, అఫ్జల్ మొహినొద్దీన్, ఆరీఫ్, దస్తగిర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని నీరుకుళ్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కాకాని శ్రీధర్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

రాజకీయ చైతన్యం కల్పించిన కాన్షీరాం



నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: బహుజనుల్లో రాజకీయ చైతన్యం కల్పించిన కాన్షీరాం ఆదర్శప్రాయుడని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఆలువాల సంజీవయ్య అన్నారు. బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం నిర్వహించిన కాన్షీరాం జయంతి సభలో ఆయన మాట్లాడారు. దేశంలో అధికశాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల హక్కుల కోసం, బహుజనుల రాజ్యాధికారం కోసం ఆయన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, శ్రీదేవి, బీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, అధ్యాపకుడు డాక్టర్ రాజేందర్, బీఎస్‌ఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, వివేక్, ఉమేష్, మహ్మద్‌అలీం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన మాసం మార్చి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నయీంనగర్: కొలన్ క్యాన్సర్ (పెద్దపేగు క్యాన్సర్)పై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం కూరపాటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మార్చి నెలను కొలొరెక్టల్ క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కూరపాటి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో పెద్దపేగు క్యాన్సర్ కూడా ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందిందన్నారు. మలంలో రక్తం పడడాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి డాక్టర్ సలహాలు పొందడం వలన క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని వివరించారు.

'ఎర్రగట్టు గుట్ట'కు పోటెత్తిన భక్తులు



హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుదీరారు. దర్శనం కోసం రెండుగంటల సమయం పట్టింది. రాత్రి చిన్న రథాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు. నగర మేయర్ గుండు సుధారాణి, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరం, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఈఓ వెంకట్రావ్ తెలిపారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

- ఎంఈఓ రాజేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేశ్‌కుమార్

దామెర : విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈఓ రాజేశ్‌కుమార్ అన్నారు. శనివారం పీఎంశ్రీలో భాగంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుత తరగతుల నుంచే లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని దానికి అనుగుణంగా కష్టపడాలన్నారు. విద్యకు ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సవితాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ బోధనను వినియోగించుకోవాలి



ఎల్కతుర్తి : కృత్రిమ మేధ గదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ సునీతారాణి



ధర్మసాగర్ : కంప్యూటర్ ద్వారా వింటున్న విద్యార్థులు

- ఎంఈఓ సునీతారాణి

ఎల్కతుర్తి : కృత్రిమ మేధ (ఏఐ) బోధనను విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి మారేపల్లి సునీతారాణి అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధా గదిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలు పెంచేందుకు ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు స్వయంగా భాషా సామర్థ్యాలు సాధన చేసి ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తారన్నారు. తెలుగు భాషా ద్వారా ఇంగ్లిష్ నేర్చుకోవడంలో కృత్రిమ మేధ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ బోధనను ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిప్రకాశ్, ఉపాధ్యాయులు రాజునాయక్, కొమురయ్య, శ్రీదేవి, రాధిక, హిమాసాగర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధతో విద్యా బోధన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంఈఓ రాంధన్ తెలిపారు. మండలంలోని దేవునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు శనివారం కృత్రిమ మేధా సాంకేతికత ద్వారా పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధా పాఠ్యాంశాలను తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో అభ్యసన సామర్థ్యాలను సాధించడంలో వెనుకంజలో ఉన్న విద్యార్థులకు కృత్రిమ మేధ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక దశలోనే విద్యార్థికి దృశ్య, శ్రవణ జ్ఞానం చేకూరి వారి సామర్థ్యాలు మెరుగుపడతాయని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కృత్రిమ మేధా సాంకేతికతతో వర్చువల్ రియాల్టీ విధానంలో బోధన జరుగుతుందని, అభ్యసనలో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనలో సామర్థ్యాలు మెరుగుపడుతాయని అన్నారు. దీని ద్వారా విద్యార్థి ఎంత మేరకు అర్థం చేసుకున్నాడో సాఫ్ట్‌వేర్ గుర్తించి అర్థం కాని వారికి మెరుగైన బోధన అందిస్తుందని తెలిపారు. హెచ్‌ఎంలు సునంద, రవీందర్, విషయ నిపుణుడు మల్లికార్జున్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి



దామెర : రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ప్రభాకర్

దామెర : మాదిగ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 5వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తరువాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి వర్గంలో ఇద్దరు మాదిగలకు చోటు కల్పించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల శ్రీనివాస్, కొండకండ్ల శ్రీను, మైపాల్, గోవిందు హరి, రతన్, ఎడ్ల రాజు, నాగెల్లి మధు, దామెర భరత్, ఎడ్ల దేవేందర్, ఎడ్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డిపై మాదిగలు మరో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీడీపీ నాయకుడు బైరపాక ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రిలే నిరాహార దీక్ష 7వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉద్యోగ నియామక ఫలితాలను నిలిపివేసి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. నేడు స్టేషన్ ఘన్‌పూర్ సభకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదాసి అబ్రహం, టీడీపీ నాయకుడు పిట్టల శ్రీనివాస్, జర్నలిస్ట్ నాయకులు ఇసంపెల్లి రమేశ్, కొట్టె లెనిన్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతిసాగర్, సోంపెల్లి అన్వేష్, చిలుక రాజు, మాచర్ల బాబు, సందీప్, నితిన్ కుమార్, రమేశ్, చిన్ని పాల్గొన్నారు.

పరకాల : అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగల డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు పరకాల పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 6వ రోజుకు చేరింది. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించి అమలు చేసే వరకు అన్ని ప్రభుత్వ నియామకాలు నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనిగరపు మొగిళి, శనిగరం రవి, గాంగరం శంకర్, శనిగరం శ్రీకాంత్, బొట్ల జాన్, గంగారం నరేశ్, శనిగరం నాగరాజు, బొచ్చు ప్రశాంత్, కొయ్యడ రాజేశ్ మాదిగ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికార సాధకుడు కాన్షీరాం

- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరకాల : బహుజనుల రాజ్యాధికార సాధకుడు బహుజన సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు అన్నారు. కాన్షీరాం జయంతి సందర్భంగా పరకాల బస్టాండ్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు బీఎస్పీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. అనంతరం కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. బహుజన కులాలకు రాజ్యాధికారాన్ని సాధించి అగ్రవర్ణాల పార్టీల కంచుకోటైన ఉత్తరప్రదేశ్‌లో బహుజన కులాలల రాజ్యాధికారాన్ని సాధించిన మహా నేత కన్షీరాం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమ్మ సాంబయ్య, నాయకులు కర్రె రమేశ్, ముత్యాల నరేందర్, పసుల భిక్షపతి పాల్గొన్నారు.